

# మరో అడుగు

## - డా.వేదుల సుభద్ర



**(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)**

"త్రీ, గట్టిగా గాలిని చీల్చుకుంటూ ఖంగున మ్రోగింది నిర్వాహకుని కంఠం. రేసు మొదలైంది. మూడు అన్న మాట వినబడగానే స్టేడియం అంతా కేరింతలతో మారుమ్రోగింది.

ఎక్కు పెట్టిన బాణాల్లా దూసుకుపోయారు వరసల్లో నిలబడిన ఆడపిల్లలు.

ప్రేక్షకుల ఊహాకందనంత వేగంగా 100 మీటర్లు, 200 మీటర్ల రేసుల మొదటి రౌండ్లు పూర్తయ్యాయి.

ఊహించినట్టుగానే రెండింటిలోనూ స్వప్నిక మొదటి స్థానంలో నిలిచింది.

స్వప్నిక ప్రాణ స్నేహితురాలు, రన్నింగ్ పార్ట్నర్ సీమ కూడా రెండింట్లోనూ నాలుగో స్థానంలో నిలిచినా ఫైనల్ రేసులో స్థానం సంపాదించుకుంది.

ఆ విషయం తెలియగానే స్నేహితురాళ్ళిద్దరూ పట్టరాని ఆనందంతో ఒకరినొకరు హత్తుకున్నారు. చేతులు పట్టుకుని కోచ్ బాలన్ దగ్గరకి పరిగెత్తారు.

" వెరీగుడ్ మై గర్ల్స్.. వెరీ హాపీ" అన్నారు ఆనందంగా వాళ్ళిద్దరి తలలమీదా ప్రేమగా తడుతూ.

"థాంక్ యూ సర్" అన్నారిద్దరూ ముక్తకంఠంతో.

"ఫైనల్ రేస్ కింకా సమయముంది. వెళ్ళి మీ వాళ్ళని కలిసి రండి. ఎండ బాగా ఉంది. ఏదైనా తాగండి" అంటూ ఇద్దరికీ లెమన్ జ్యూస్, అరటిపండు ఇచ్చారు. అవి పట్టుకుని నవ్వుకుంటూ స్టాండ్స్ లో ఉన్న తమ వారిదగ్గరకి నడిచారు. వారివెనకే ఆయన కూడా.

సీమ వాళ్ళ అమ్మ మాధవి, కిరణ్, రాధిక, రాగిణి, శేఖర్, సాహిల్ ఆనందంగా చేతులూపారు పిల్లల వైపు చూస్తూ.

" ఇంకొక్క రేసే నాన్నా, మీ అమ్మాయి నేషనల్ లెవెల్ రన్నర్ అవడానికి" పరుగున తండ్రి దగ్గరకి వెళ్ళి అతన్ని అల్లుకుపోతూ చెప్పింది స్వప్నిక.

"యెస్ నాన్నా, నువ్వు తప్పకుండా సాధిస్తావు." కూతురి నుదిటిమీద పడుతున్న జుట్టుని చెవి పక్కకి సర్దుతూ ప్రేమగా చెప్పాడు కిరణ్.

"నీ రికార్డ్ స్టడీగా ఉంది స్వప్నికా, టైమింగ్ కూడా బెటర్ అవుతోంది. ఇలాగే మెయింటైన్ చేస్తే తప్పకుండా నువ్వే గెలుస్తావు. సీమా, నువ్వు కొంచం టైమింగ్ చూసుకో, ఫైనల్ రేస్ లో మొదటి మూడు స్థానాలవాళ్ళకే నేషనల్స్ కి వెళ్ళే అవకాశం అని తెలుసుగా, నువ్వు కూడా తప్పకుండా సాధిస్తావు నాకు తెలుసు" అంటూ ఇద్దరికీ తరవాత పోటీల్లో మెరుగుపరచుకోవలసిన విషయాలు, చెయ్యకూడని తప్పులు ఇలాంటివెన్నో చెప్పారు కొన్ని నిమిషాలసేపు.

ఆపైన వాళ్ళని కొద్దిసేపు రెస్ట్ తీసుకోమని, తను ఫైనల్ రేస్ మొదలుపెట్టే ముందు వస్తానని చెప్పి వెళ్ళారు.

ఆయన చెప్పిన విషయాలన్నీ పిల్లలతో పాటు, వాళ్ళిద్దరికంటే శ్రద్ధగా విన్నాడు కిరణ్ ఎప్పటిలాగే.

కోచ్ బాలన్ పర్యవేక్షణలోనే  స్వప్నిక ఎంతో మెరుగైంది.

స్వప్నిక ని దేశంగర్వించే అథ్లీట్ గా చూడాలన్నది తండ్రిగా కిరణ్ దే కాదు కోచ్ గా ఆయన కల కూడా.

పిల్లలిద్దరూ వాళ్ళ అమ్మలపక్కన కూర్చుని కబుర్లలో పడ్డారు. రాధిక ఎప్పటిలాగే కూతురి ముఖం,కాళ్ళూ, చేతులూ చల్లని తడి గుడ్డ తో తుడిచి సన్స్క్రీన్ క్రీం రాస్తోంది.

రేసు గెలిచిన ఆనందంతో మెరుస్తున్న నవ్వుముఖంతో ఉన్న కూతురిని కన్నార్పకుండా చూస్తున్నాడు కిరణ్.

" ఎన్ని ఆనందాలు తెచ్చింది ఈ చిట్టితల్లి తమ జీవితాల్లోకి!" అనుకున్నాడు.తన జీవితంలోకి రాధిక రాకే గొప్ప ఆనందం అనుకుంటే మొదట స్వప్నిక, ఆ తర్వాత సాహిల్ వచ్చి తన జీవితాన్నే మార్చేశారు.

కిరణ్ వాళ్ళది సిటీకి దగ్గరలోనే ఉన్న ఒక టౌన్. తండ్రి రాఘవయ్య వ్యవసాయం చేసేవాడు. కిరణ్ నీ, అతని అక్కలిద్దరినీ తమకున్నంతలో జాగ్రత్తగా పెంచి పెద్ద చేశాడాయన. తల్లి తులసి పెద్ద గడసరి కాదు, భర్త మాట జవదాటకుండా, ఆయన చెప్పిన రీతిలో ఇల్లు దిద్దుకుంటూ వచ్చిన ఇల్లాలు.

పుట్టిన చిన్న ఊరిలో ఆడుతూ పాడుతూ చదువుకునేవాడు కిరణ్. ఎలా వచ్చిందో తెలీదు కానీ ఫోటోగ్రఫీ అంటే అమితమైన ఆసక్తి. అలాగే ఆటల్లోనూ, అంతే, ముఖ్యంగా పరుగు పందేలు, కబడ్డీల్లో. ఈత అంటే కూడా చాలా ఇష్టం కిరణ్ కి.

"చదువుమీద కూడా శ్రద్ధ పెట్టునాన్నా, మనకున్న ఈ చిన్న చెక్క మన అందరి అవసరాలు తీర్చదు. నీ పొట్ట గడుపుకోవడానికి ఓ ఉద్యోగం ఉండాలి. నిన్నెప్పటికైనా గవర్నమెంట్ ఉద్యోగస్థుడిగా చూడాలనే నా కోరిక." చెవిలో ఇల్లు కట్టుకుని చెప్పేవాడు రాఘవయ్య.

కంటికి నచ్చినదాన్ని కెమెరాతో బంధించడం, దాన్ని ఓ పోటీకో, పత్రికకో పంపడం హాబీగా మొదలయ్యి ఆపైన గొప్ప ఇష్టంగా మారింది.

తన స్నేహితులు, కాలేజీలో గురువుల సాయంతో నేర్చుకున్న ఫోటోగ్రఫీ కోర్సుల వల్ల పెద్ద ఇంటర్నేషనల్ ఫోటోగ్రాఫర్ కాకపోయినా యూనివర్సిటీలో ఫోటోగ్రాఫర్ గా ఉద్యోగమూ, దానితో ఉండడానికో చిన్న క్వార్టరూ లభించాయి. రకరకాల ఆటల పోటీల్లో జిల్లాస్థాయిలో పాల్గొని ఎన్నో పతకాలు, బహుమతులు గెల్చుకున్నాడు కిరణ్. అతనికి యూనివర్సిటీ ఉద్యోగం రావడానికి స్పోర్ట్స్ కోటా కూడా ఒక కారణం.

ఆ ఉద్యోగం వచ్చిన నాడు రాఘవయ్య ఆనందం మాటల్లో చెప్పలేనిది.

"భలేరా నాన్నా, సాధించావురా. చాలు, నీజీవితం హాయిగా గడిచిపోతుంది. ఉండడానికి చక్కటి ఇల్లూ, నెల తిరిగేసరికి ఖచ్చితంగా వచ్చే జీతం, అదీ నీకిష్టమైన పని కూడానూ. తులసీ అబ్బాయికి దిష్టి తియ్యి!" అంటూ చిన్నపిల్లాడిలా సంబరపడిపోయాడు.

ఆయనకంటే ఎక్కువ ఆనందించాడు ఆయన స్నేహితుడు, రాధిక నాన్న రంగారావు.

"ఒరే, రంగయ్యా, మావాడికి యూనివర్సిటీలో ఉద్యోగం వచ్చింది, చూసుకో మరి! కట్నమెంత ఇచ్చి కోడల్ని మా ఇంటికి పంపుతావో?" అన్నాడు.

"మా బంగారు తల్లిని మించి నేనేమివ్వగలన్రా?" అంటూ నవ్వాడు రంగారావు.

"నాక్కావలసిందీ ఆ బంగారమే, అమ్మాయి ఏమంటుందో కనుక్కో, నేనూ మావాడినో మాట అడుగుతా" అన్నాడు రాఘవయ్య నవ్వుతూ

రంగారావు ఒక్కగానొక్క కూతురు రాధిక. చిన్నప్పుడే తల్లిని కోల్పోయిన కూతుర్ని కళ్ళల్లో పెట్టుకుని పెంచాడు ఆయన. చదువుకున్న విలువ తెలిసిన స్కూల్ మేస్టారు కనక కూతుర్ని ఇంటర్ వరకూ చదివించాడు. ఆపైన దగ్గరలో డిగ్రీ కాలేజీ లేనందున, హాస్టల్ లోనో, బంధువుల ఇళ్ళల్లోనో అమ్మాయిని ఉంచలేక ఇంక చదివించలేకపోయాడు. ప్రైవెట్ గా డిగ్రీ చదవాలన్న ఆమె ప్రయత్నాలు ఫలించలేదు.

సరైన సంబంధం దొరికితే పెళ్ళి చేసెయ్యాలన్నదే ఆయన ఆలోచన, అదే మాట స్నేహితుడి నోటినించి రావడం ఆయనకి చెప్పలేని సంతోషాన్ని కలిగించింది.

బాగా తెలిసిన పిల్ల, చక్కటిది, మంచిది అంటూ తులసి కూడా సంబరపడింది

అందరికీ నచ్చినందువల్ల త్వరలోనే కిరణ్, రాధిక లు ఒకటయ్యారు. ఆ తర్వాత సిటీలో కాపరం పెట్టారు.

తల్లి లేని రాధికకి కిరణ్ తల్లి తులసి అంటే ఎంతో ఇష్టం. ఒక్కత్తే కోడలు కావడాన తనని గారాబంగా చూసుకునే అత్తగారు దొరకడం తన అదృష్టంగా భావించేది రాధిక. నెమ్మది అయిన పిల్ల, వినయం, విధేయత, మాట మంచితనమూ, కుటుంబాన్ని చక్కదిద్దుకోవడమూ అన్నీ రాధికకున్న మంచి లక్షణాలే.

ప్రతీ చిన్నదానికి ఎక్కువగా ఆలోచిస్తూ బాధపడడం ఆమెకున్న బలహీనత.

"మనమెంత ఆలోచించినా జరిగేది జరగక మానదు, దానికి బాధపడడమెందుకు? ఉన్నన్ని రోజులు సరదాగా ఉండాలి" అంటాడు కిరణ్.

భార్యని ప్రేమగా చూసుకుంటూ ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ సరదాగా ఉండే కిరణ్ అంటే రాధికకి ప్రాణం.

ఆమెకి తెలిసిన చిన్న ప్రపంచంలో మొదట తన తండ్రి, ఇప్పుడు భర్త, ఈ ఇద్దరే హీరోలు.

క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ ధృఢంగా, బలంగా ఉంటాడు కిరణ్. ఆహారపు అలవాట్లతో కూడా జాగ్రత్తగా ఉంటాడు. ఒక ఆటగాడిగా ఆరోగ్యం మీద ఉన్న అతని అవగాహన చాలా గొప్పది. అదే రాధికకూ, పిల్లలకూ కూడా అలవాటు చేశాడు. వేళకి తినడం, తగినంత విశ్రాంతి, వ్యాయామం ఇవన్నీ ఆ కుటుంబంలో ఎవరూ చెప్పకుండా జరిగే పనులు. ఏ పూటైనా రాధిక బద్ధకించినా, వాకింగ్, యోగా చెయ్యకపోయినప్పుడు మాత్రమే కిరణ్ కి కోపం వచ్చేది.

అనుకోకుండా వచ్చిన ఈ ఉద్యోగం పెద్ద ప్రొఫెషనల్ ఫోటోగ్రాఫర్ కావాలన్న అతని కల మీద నీళ్ళు చిలకరించింది నిజానికి. అయినా అతను నిరాశ పడలేదు.

మూసుకున్న ఒక తలుపు పక్కన మనం తెరవాల్సిన తలుపు మరొకటి ఉంటుందని బలంగా నమ్మే అతనికి ఇప్పుడు తనదైన ఒక స్టూడియో ఏర్పరుచుకోవాలి అన్నది ఓ కల. కొత్త రకాల ప్రయోగాలతోనూ, ఇప్పుడు మారుతున్న టెక్నాలజీని ఉపయోగించి అద్భుతాలు చెయ్యాలన్నది అతని ఆశ.

" చేతిలో నాలుగు డబ్బులాడినప్పుడే ఇంట్లోకో వస్తువో, అమ్మాయి మెడలో ఓ గొలుసో కొనుక్కోక ఈ పుస్తకాల మీదా, ఫోటో డబ్బాల మీద తగలేస్తావేమిట్రా?" అని తండ్రి కోప్పడినప్పుడల్లా నవ్వేవాడు.

ఫొటోగ్రఫీకి సంబందించిన పుస్తకాలు, పత్రికలూ తెప్పించడం. ఎప్పుడైనా ఫోటోగ్రఫీ టూర్ లకి వెళ్ళడం ఇలాంటివి అతనికెంతో ఇష్టం. తనకంటూ ప్రత్యేకమైన హాబీలేమీ లేని రాధిక భర్తకి ఎప్పుడూ తోడుగా ఉండేది.

" పరవాలేదు మావయ్యా, నాకెప్పుడూ బంగారాల మీద ఇష్టం లేదు, తనకిష్టమైనవి చేసుకోనివ్వండి" అంటూ.

"సరిపోయిందమ్మా, నువ్వు మా తులశమ్మ కంటే వెర్రి బాగుల్దానివి తయారయ్యావు. పిల్లలు ఎదిగి వస్తున్నప్పుడైనా నాలుగు రూపాయలొద్దూ! అవసరాలు చెప్పి వస్తాయా?" అనేవాడు నవ్వుతూ.

ఆమె కూడా నవ్వేది మావగారి మాటలకి.

కిరణ్ ఏదైనా పోటీలో పాల్గొని బహుమతులు గెల్చుకుంటే అందరికంటే ఎక్కువ సంతోషించేది. తన ఇల్లు శుభ్రంగా, పొందిగ్గా పెట్టుకోవడం, పిల్లలకీ కిరణ్ కీ ఇష్టమైనవి వండి పెట్టడం, రాగిణి తో కబుర్లు చెప్పుకోవడం ఇవే రాధికకి ఇష్టమైన పనులు.

ఎప్పటికైనా తమదైన ఓ చిన్న ఇల్లు కట్టుకోవాలని, అందులో ఒక గది ప్రత్యేకంగా కిరణ్ స్టూడియోగా ఏర్పరుచుకోవాలనీ, పిల్లలిద్దరినీ బాధ్యత కల పౌరులుగా పెంచాలనీ. ఇంతకంటే పెద్ద ఆశలేమీ లేని చిన్న కుటుంబం వారిది.

స్వప్నిక వాళ్ళ జీవితాల్లోకి రావడానికి ఐదేళ్ళు పట్టింది. అ ఐదేళ్ళు రాధికకి చాలా కష్టంగా గడిచింది. ఇరుగుపొరుగు వారూ, బంధువులూ అందరూ పదే పదే పిల్లల విషయం ప్రస్తావిస్తూ ఉంటే ఆమెకి ఏమి చెప్పాలో తెలీక చాలా బాధపడేది.

"ఎవరో ఏదో అన్నారని నువ్విలా బాధ పడచ్చా రాధీ? ఎవరికి ఎప్పుడు ఏం జరగాలో అది జరుగి తీరుతుంది. మనం కంగారు పడితే పనులై పోతాయా? అనేవాడు.

అతనన్నట్టే వాళ్ళ పెళ్ళి అయిన ఐదేళ్ళకి వాళ్ళకి అందివచ్చిన వరం లా స్వప్నిక పుట్టింది. అప్పటినించీ ఆమె కిరణ్ ప్రపంచమైపోయింది.

కూతురిని చూస్తూ ఆలోచనల్లోకి జారుకున్న కిరణ్ బాలన్ సార్ పిలుపుతో ఉలిక్కిపడి తిరిగి చూశాడు.

" కమాన్ గర్ల్స్, ఫైనల్ రౌండ్ నౌ. ఫోకస్ అండ్ స్టే షార్ప్ అంతే" అంటూ ఇద్దరినీ తనతో తీసుకువెళ్ళారు.

మళ్ళీ అందరిలోనూ ఉత్సుకత, ఉద్వేగం. స్వప్ని, సీమా ఇద్దరూ బై చెప్పేసి తమ స్థానాల దగ్గరకి పరిగెత్తారు హుషారుగా.

తమ పేర్లు చదువుతూ నిలబడమన్న స్థానాల దగ్గర నిలబడి ముందున్న ట్రాక్ ల ని చూసుకుంటున్నారు.

స్వప్నిక కి ఎందుకో ఉన్నట్టుండి కొద్దిగా అనీజీగా అనిపించిది. దగ్గరలోనే ఉన్న బాలన్ సార్ తో చెప్పింది.

"ఎండవల్లనేమో స్వప్నికా, ఒక్క సారి చల్లనీళ్ళతో ముఖం కడుక్కుని కొద్దిగా నీళ్ళు తాగు. జస్ట్ ఏ ఫ్యూ సిప్స్." అన్నారు. ఆయన చెప్పినట్టు చేసిన తర్వాత కొద్దిగా తగ్గి, మళ్ళీ మాములుగా అనిపించింది. సార్ వైపు బొటనవేలు ఎత్తి చూపించి నవ్వింది. ఆయన కూడా “గుడ్” అంటూ సైగ చేశారు.

ఇదంతా దూరాన్నుంచి చూస్తున్న కిరణ్ గబ గబా బాలన్ సార్ దగ్గరకి వచ్చి విషయమేమిటని అడిగాడు. ఆయన క్లుప్తంగా చెప్పి, మరేమీ కంగారు పడక్కరలేదు అంటూ చెప్పారు.

అయినా సమాధాన పడలేని కిరణ్ కి కంగారుగా అనిపించింది.

మొదట జరిగిన 200 మీటర్ల ఫైనల్ రేస్ని స్వపనిక  మొదటి స్థానం లో పూర్తి చేశాకే కిరణ్ మనసు స్థిమితపడింది.

“ఇంక ఒక్కటే మిగిలింది. 100 మీటర్ల ఫైనల్ రేస్!” . అనుకున్నాడు.

స్వప్నిక కూడా లైన్ మీద నిలబడి “ఒక్కటే స్వప్నీ, నేషనల్ లెవెల్ రేస్ కి వెళ్ళడానికి”  అనుకుంది.

వంద మీటర్ల రేసే కష్టమైనది అని ఆమెకి తెలుసు.

పరిగెత్తవలసిన దూరం తగ్గే కొద్దీ రేస్ కష్టతరమౌతుంది. మొదటి అడుగు నించే వేగంగా పరిగెత్తాలి, రిలాక్స్ అవ్వడానికి కానీ, కొంతసేపటితర్వాత వేగం పెంచుదామని కానీ అనుకోవడానికి వీలే ఉండదు.

అందుకే “ట్రేసర్ బుల్లెట్” మాదిరిగా మూడు అనగానే రివ్వున ముందుకురికింది స్వప్నిక.

ఆమె గురించి తెలిసిన వాళ్ళూ, ఆమె స్కూల్ వాళ్ళూ నిలబడి “స్వప్నిక. స్వప్నిక.” అని అరుస్తూ ఆమెని ఉత్సాహపరచడం మొదలుపెట్టారు.

“వచ్చేస్తోంది. దాదాపు అయిపోయింది” కిరణ్ మనసు ఉద్వేగం భరించలేకపోతోంది. ఊపిరి బిగపట్టుకుని చువ్వలా పరిగెడుతున్న కూతుర్నే చూస్తున్నాడు.

మరొక్క 50 మీటర్లు.

20.

10..

2.

1.

“మరొక్క అడుగు “ ముందుకు వేస్తే చాలు, ఫస్ట్ వచ్చేస్తుంది. గెలిచేసినట్టే. అనుకున్నాడు కిరణ్.

స్వప్నిక కూడా అలాగే అనుకుంటూ ముందుకురికుంది. వెయ్యవలసిన చివరి అడుగుకై కాలు గాల్లో ఉండగా.

ఒక్కసారిగా భుజంలో ఎవరో దేనితోనో గుచ్చినట్టుగా విపరీతమైన నొప్పి మొదలైంది. భరించలేని ఆ నొప్పిని తట్టుకోలేకపోయిన ఆమె రెండో చేత్తో ఆ భుజాన్ని పట్టుకుని శక్తి కూడదీసుకుని గాల్లో ఉన్న కాలుని లైను దాటించింది. అందరికంటే ముందుగానే వచ్చిందా? లేదా? అనుమానమే ఆమె మనసులో చివరిగా అనిపించినదిది.

స్వప్నిక కాలు లైన్ దాటగానే “ ఆమె రేసులో మొదటిదిగా వచ్చిందన్న విషయం అర్థం అవగానే స్టేడియమంతా పరుచుకున్న ఉత్సాహం. చప్పట్లు కొడుతున్న వారందరూ అక్కడ జరుగుతున్నది చూసి ఆగిపోయారు.

కారణం.

లైన్ దాటిన వెంటనే ఎవరో బలంగా తోసేసినట్టుగా బోర్లా పడిపోయింది స్వప్నిక.ఐదడుగుల ఏడంగుళ్లాల ఆమె సన్నటి, ధృఢమైన శరీరం ఒక్క ఉదుటున ధబ్ మన్న శబ్దంతో నేలకొరిగిపోయింది. వెనక్కి విరుచుకుని వెల్లకిలా పడటం తోనే స్పృహ తప్పిందామెకి.

కనీసం ఓ చిన్నమూలుగు లేదు. అమ్మా అన్న మాట లేదు. పడిన వెంటనే స్పృహ తప్పిందామెకి. అసలు రేసు మొదలైంది.

**ఈ పరుగు వచ్చే నెల దాకా.**

Post your comments